క్లుప్తంగా

రైతులకు పరిహారం ఇవ్వాలని వినతి

బంటుమిల్లి: ఈ ఏడాది జూలైలో కురిసిన భారీ వర్షాలతో పాటు 2022వ సంవత్సరం సార్వా పంట రవాణా చార్జీలు ఇప్పించాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణకు మెమొరాండం అందజేశారు. జూలైలో కురిసిన అతిభారీ వర్షాలకు రైతులు, కౌలు రైతులు వేలాది రూపాయలు నష్టపోయారన్నారు. వీరిని ఆదుకోవాలని కోరారు. 2022 సంవత్సరం సార్వా పంటకు సంబంధించి ప్రభుత్వం హమాలీ చార్జీలు ఇచ్చిందని, రవాణా చార్జీలు ఇవ్వలేదని చెప్పారు. ప్రభుత్వం స్పందించి రైతులకు రెండు పరిహారాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు జి.నాగేశ్వరరావు, ఎస్.జనార్దన్‌రావు, ఎం.శ్రీనివాసరావు, పి.నరసింహారావు పాల్గొన్నారు.

3న బధిరుల వివాహ పరిచయ వేదిక

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నగరంలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సెప్టెంబర్ 3వ తేదీన బధిర(మూగ, చెవిటి) వధూవరుల వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు ఏపీ మ్యాట్రిమోనియల్ బధిరుల సంక్షేమ సంఘ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఆ రోజు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరిచయ వేదిక జరుగుతుందని తెలిపారు. ఎటువంటి కుల ప్రతిపాదన లేకుండా, అన్ని కులాల బధిరులు వివాహ వేదికను సద్వినియోగం చేసుకోవచ్చునని పేర్కొన్నారు. పాల్గొనే వారు మాక్సీ సైజ్ ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు రూ.500 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. పరిచయ వేదికకు వచ్చే యువతి, యువకులతో పాటు ముగ్గురికి మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తామని చైర్మన్ వి.యాదవరెడ్డి, అధ్యక్షుడు శివప్రసాద్ పేర్కొన్నారు.

వ్యవసాయరంగ అభివృద్ధికి కృషి

- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు
- రూ.40లక్షలతో నిర్మించిన గిడ్డంగి ప్రారంభం



గోడౌన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, పక్కన కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి తదితరులు

వక్కలగడ్డ(చల్లపల్లి): వ్యవసాయ రంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మండల పరిధిలోని వక్కలగడ్డ పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోమవారం రూ.40 లక్షలతో నిర్మించిన 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన వ్యవసాయ ఉత్పత్తుల గిడ్డంగిని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం ఆవిర్భవించిన వక్కలగడ్డ పీఏసీఎస్ అభివృద్ధి చెందిన తీరు ఆదర్శనీయమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కేడీసీసీ బ్యాంక్ అనేక శాఖలకు సొంత భవనాలు సమకూరాయన్నారు. అనేక సంఘాలకు నూతన భవనాలు, గిడ్డంగుల నిర్మాణం, లాకర్ల సదుపాయం, నూతన క్యాష్ కౌంటర్లు ఏర్పడ్డాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా డీసీసీబీలు, సొసైటీలు లాభాల బాటలో పయనిస్తూ రెట్టింపు టర్నోవర్ సాధిస్తున్నాయని వివరించారు.

రూ.2 లక్షల రుణాలు

కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ తాతినేని పద్మావతి మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో శ్లాబ్ దశకు చేరిన సొసైటీ సభ్య రైతుల గృహ నిర్మాణాలకు కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో సొసైటీల ద్వారా రూ.2 లక్షలు రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు విస్తృత రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. సీఎం జగన్ సహకారంతో కేడీసీసీ బ్యాంక్ అభివృద్ధి పథంలో పయనిస్తున్నట్లు తెలిపారు.

ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానా, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, జెడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి, సర్పంచ్ వల్లూరు ఉమా, కేడీసీసీ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ నగరాజకుమారి, సీపీఐ రాష్ట్ర నాయకురాలు అక్కినేని వనజ, ఆలిండియా కిసాన్ మహాసభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, సొసైటీ సీఈఓ పుట్టి వెంకటేష్ బాబు ప్రసంగించారు. అనంతరం రైతులకు సొసైటీ డివిడెంట్లను పంపిణీ చేశారు. పీఏసీఎస్ ఆవరణలో మల్లుపెద్ది రామసుబ్బయ్య కాంస్య విగ్రహం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పీఏసీఎస్ చైర్మన్లు, సీఈఓలు, రైతు పెద్దలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే పోలీసుల కర్తవ్యం

స్పందనలో జిల్లా ఎస్పీ జాషువా



ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎస్పీ జాషువా

కోనేరుసెంటర్: ప్రజా సమస్యల పరిష్కారమే పోలీసుల ప్రథమ కర్తవ్యమని జిల్లా ఎస్పీ పి.జాషువా తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని స్పందన హాల్‌లో సోమవారం జరిగిన స్పందనలో పాల్గొన్న ఎస్పీ వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాధితుల సమస్యలను ఆలకించారు. బాధితులకు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు. స్పందనలో వచ్చిన పలు అర్జీల వివరాలు ఇవి.

యువకులు వేధిస్తున్నారు..

తాను ఓ ప్రైవేట్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నానని, కళాశాలకు వెళ్లి, వచ్చే సమయాల్లో కొంత మంది యువకులు తనను ర్యాగింగ్ చేస్తున్నారని గన్నవరానికి చెందిన ఓ యువతి ఎస్పీకి విన్నవించింది. అసభ్యకర పదజాలంతో అవమానపరుస్తున్నారని తెలిపింది. కుటుంబ సభ్యులు యువకుల పెద్దలతో మాట్లాడి విషయం చెప్పినప్పటికీ వారిలో మార్పు లేదని ఆవేదన చెందింది. చివరికి తన ఇంటికి వచ్చి మరీ అవమానిస్తున్నారంటూ కన్నీరు పెట్టుకుంది. వారి నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరింది. స్పందించిన ఎస్పీ బాధితురాలి ఫిర్యాదును సంబంధిత స్టేషన్ అధికారికి సిఫార్సు చేసి యువకులపై చర్యలు తీసుకుని యువతికి రక్షణ కల్పించాలని ఆదేశించారు.

గర్భిణి అని కూడా చూడకుండా దాడి చేశారు..

తాడిగడపకు చెందిన ఓ వివాహిత ఎస్పీని కలిసి పెద్దల సమక్షంలో తనకు వివాహం జరిగిందని, రెండు నెలల పాటు సజావుగా కాపురం చేసిన భర్త అత్తమామలతో కలిసి అధిక కట్నం కోసం వేధిస్తున్నారంటూ వాపోయింది. తన ఫోన్‌ను హ్యాక్ చేసి పుట్టింటి వాళ్లతో మాట్లాడే విషయాలన్నీ వింటూ తనపై శారీరకంగా దాడి చేయటంతో పాటు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. గర్భవతి అని కూడా చూడకుండా భర్త, అత్తమామలు కలిసి తనపై దాడి చేసి, పుట్టింటి నుంచి నగదు తీసుకురావాలంటూ బెదిరిస్తున్నారని తెలిపింది. కట్నం తీసుకురాని పక్షంలో తన భర్తకు మరో వివాహం చేస్తామని అత్తమామలు బెదిరిస్తున్నారంటూ కన్నీరుపెట్టుకుంది. బాధితురాలికి తక్షణమే న్యాయం చేయడంతో పాటు భర్త, అత్తమామలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ అధికారులను ఆదేశించారు.

ఉద్యోగం ఇప్పిస్తానంటూ టోకరా..

తన పెద్ద కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని తమ సమీప బంధువు మోసం చేశాడంటూ పెనమలూరుకు చెందిన ఓ వివాహిత స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. పెద్ద వ్యక్తులతో తనకు పరిచయాలు ఉన్నాయని చెప్పడంతో నమ్మి, రూ.3 లక్షలు అతనికి ఇచ్చానని చెప్పింది. డబ్బు తీసుకున్న వ్యక్తి ఇంత వరకు తన కుమారుడికి ఉద్యోగం ఇప్పించకపోగా, డబ్బు అడుగుతుంటే బెదిరింపులకు పాల్పడుతూ తనను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడంటూ వాపోయింది. అతని నుంచి రక్షణ కల్పించి న్యాయం జరిగేలా చూడాలని వేడుకుంది. చర్యలు తీసుకోవాలని పెనమలూరు స్టేషన్ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీహరిబాబు పాల్గొన్నారు.

పార్టీలకతీతం.. అర్హతే ప్రామాణికం

మందపాకలలో గడప గడపకు మన ప్రభుత్వం



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ఇంటింటికీ సంక్షేమ ఫలాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని మందపాకల సచివాలయ పరిధిలోని అద్దంకివారిదిబ్బ, పిండివానిదిబ్బ గ్రామాల్లో సోమవారం రమేష్‌బాబు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయా గ్రామాల్లోని 430 ఇళ్లకు తిరిగి సంక్షేమ పథకాలను, కుటుంబసభ్యులు పొందిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ముద్రించిన బుక్‌లెట్‌ను అందించి, జగన్‌మోహన్‌రెడ్డితో పాటు తనను కూడా దీవించాలని రమేష్‌బాబు కోరారు. ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరిగేలా ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.

రహదారి నిర్మాణంపై హర్షం

కోడూరు నుంచి పోటుమీద వరకు తమ గ్రామాన్ని కలుపుతూ డబుల్‌లైన్ రహదారి నిర్మాణాన్ని చేపట్టడంపై మందపాకల గ్రామస్తులు రమేష్‌బాబు వద్ద హర్షం వ్యక్తం చేశారు. గతంలో తమ గ్రామంలోని ప్రధాన రహదారి పూర్తి అధ్వానంగా, బురదమయంగా ఉండేదని, ఇప్పుడు సీసీ రోడ్డు నిర్మాణంతో కష్టాలు తొలగాయని గ్రామస్తులు తెలిపారు. ఇంటింటికి కుళాయిని కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రమేష్‌బాబు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యన్నారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, సర్పంచి అద్దంకి శివప్రసాద్, జిల్లా ఎస్సీసెల్ కన్వీనర్ గుర్రం బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా తొలిసారి ఎస్సీలకు ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీదే

దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ



అవనిగడ్డ: దివి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని తొలిసారిగా ఎస్సీలకు ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీదని ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు చెప్పారు. స్థానిక ఏఎంసీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎప్పుడో బ్యానర్‌లో తన ఫొటో వేయక పోవడాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు ఆపాదించి విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎవరో వ్యక్తిగతంగా వేసిన బ్యానర్‌లో ఫొటోపై కుల రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. వైఎస్సార్ సీపీపై ఎస్సీల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకే ఇలాంటి విమర్శలు చేస్తున్నారని కొక్కిలిగడ్డ పేర్కొన్నారు. రాజకీయంగా ఎదుగుదలను చూసి ఓర్వలేక కొంతమంది రూ.35లక్షలు ఇచ్చి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని తీసుకున్నానని చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. బహిరంగ చర్చకు సిద్ధమని తనపై విమర్శలు చేస్తున్న వారు ఆరోపణలు రుజువు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని, రుజువు చేయకపోతే వారు రాజకీయ సన్యాసం చేస్తారా అని కొక్కిలిగడ్డ సవాల్ విసిరారు. టీడీపీలో మాదిరి ఎస్సీ నేతలు చంద్రబాబుకి వంగి వంగి దండాలు పెట్టే సంస్కృతి మా పార్టీలో లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితుల అభ్యున్నతికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు.

ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచి చల్లపల్లి వారు ఇచ్చిన భోగట్టా ప్రకారం యావన్మందికీ తెలుపునది ఏమనగా ఈ క్రింది షెడ్యూలులో చూపిన [illegible] పెద వీరాస్వామి గారి కుమారుడు [illegible] గారి స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేసుకుని ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నాము. కావున సదరు వ్యవహారానికి సంబంధించి ఎవరికైననూ ఎటువంటి అభ్యంతరాలు గానీ, ఇష్యూలు, రాళ్లీలు, క్లెయిమ్‌లు, తనఖాలు, అగ్రి మెంట్లు, కోర్టు వివాదాలు ఉన్న యెడల నేటి నుండి 7 రోజులలోపు ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకంగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరాలకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూల్: కృష్ణాజిల్లా, అవనిగడ్డ సబ్ రిజిస్ట్రారు వారి ఋలకా, అవనిగడ్డ మండలం, అవనిగడ్డ రెవిన్యూ గ్రామ పంచాయితీలోని దస్తావేజు నెం. 2822/2019 రు గ్రామ రీ సర్వే నెం. 89-5[illegible] లో చ.గ. 167.1 ల స్థలమునకు హద్దులు : తూర్పు : ఎమ్. రాజశేఖర్ స్థలం హద్దు 32 అ॥లు, దక్షిణం : పంచాయితీ రోడ్డు హద్దు 47 అ॥లు, పడమర: ఎమ్. రాజారావు గారి స్థలం హద్దు 52 అ॥లు, ఉత్తరం: ఉమ్మడి కాలిదారి హద్దు 47 అ॥లు

యు.వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, న్యాయవాది, మచిలీపట్నం

అక్రమ కట్టడం కూల్చివేత



పెడనలో అక్రమ కట్టడాన్ని తొలగిస్తున్న దృశ్యం

పెడన: పురపాలక, ముడా, రైల్వే వారి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాన్ని అధికారులు సోమవారం కూల్చేశారు. పెడన పురపాలక సంఘ చరిత్రలో మొట్టమొదటిసారిగా అక్రమ కట్టడం కూల్చేయడంపై పట్టణంలో చర్చనీయాంశమైంది. పెడన గూడూరు రహదారిపై 20వ వార్డులో రైలు గేటు పక్కన ఓ స్థలంలో ఇంటి నిర్మాణం కోసం ప్లానుకు దరఖాస్తు చేసి షాపులు కట్టాడు ఆ స్థల యజమాని. ఇంటి నిర్మాణానికి ప్లాన్ తీసుకుని షాపులు కట్టడం, అవి కూడా రైల్వే లైన్ పక్కన నిర్మాణం చేసేటప్పుడు ఉండాల్సి వ్యత్యాసాన్ని కూడా వదలలేదు. దీనికి తోడు ముడా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారు. దీనిపై ఏడాది క్రితం అధికారులకు ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ చేయగా అది అక్రమ కట్టడమని తేలింది. విచారణకు ముందు జాయింట్ కలెక్టర్ అపరాజితాసింగ్ మచిలీపట్నం ఆర్డీఓ కిషోర్‌తో కలిసి రెవెన్యూ అధికారులు మున్సిపల్ అధికారులు రైలు గేటు పక్క స్థలాన్ని పరిశీలించారు. ఆ సమయంలో స్థానికులు తెలిపిన అంశాలను దృష్టిలో ఉంచుకున్న జాయింట్ కలెక్టర్ అపరాజితా సింగ్ పూర్తి స్థాయిలో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ముడా అధికారులను ఆదేశించారు ముడా అధికారులు, రైల్వే అధికారుల నోటీసులు తదితర అంశాలపై జేసీకి నివేదిక ఇచ్చారు. జేసీ ఆదేశాలతో అక్రమ కట్టడాన్ని పోలీసు బందోబస్తు మధ్య ముడా అధికారులు తొలగించారు. ప్లానింగ్ అధికారి ఎం. సత్యనారాయణ, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ టి.మల్లికార్జున, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ సృజన కుమారి, జేపీఓ బాలాజీ, మున్సిపల్ కమిషనర్ మహేంద్ర, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వి.ఏసుబాబు తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ చంద్రయ్య

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు డివిజన్లలో పశువులు రోడ్లపై తిరుగుతున్నాయని వీటిని నివారించడానికి చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ జి. చంద్రయ్య సచివాలయ శానిటేషన్ సెక్రటరీలకు సూచించారు. నగరంలోని పలు డివిజన్లలో సోమవారం తెల్లవారుజామున పారిశుద్ధ్య పనుల నిర్వహణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఆయన పలు అంశాలపై సూచనలు చేశారు. రహదారులు, ప్రధాన కూడళ్ల వద్ద పశువులు పెద్ద ఎత్తున ఉంటున్నాయని వీటితో వాహనచోదకులు ఇబ్బందులు పడటమే కాకుండా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వీటి నివారణకు పశువులు నిలవకుండా చూడాలన్నారు. పశువుల యజమానులతో చర్చించి వాటిని రోడ్లపైకి రాకుండా చూడాలని చెప్పారు. ఈ సందర్భంగా కార్మికుల హాజరుతీరును పరిశీలించారు.

‘కొల్లూరి’ ట్రస్ట్ చిన్నాకు అంబేడ్కర్ జాతీయ సేవారత్న అవార్డు



జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

పెడన: అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు, కొల్లూరి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జాతీయ సేవారత్న అవార్డును విశాఖపట్నంలో అందుకున్నారు. శ్రీ దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ అనుబంధ సంస్థ విశాఖ రత్న కళాపరిషత్ వ్యవస్థాపకులు పీపీ భాస్కర రావు ఆదివారం దాసరి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో చిన్నాకు అవార్డు అందజేశారు. అనేక సేవా కార్యక్రమాలు చేయడంతో ఆయనకు అవార్డు వచ్చింది. కొల్లూరికి విజయవాడకు చెందిన ఆలిండియా నాని సేవాదళ్ వ్యవస్థాపకులు ఆకుమళ్ల అంబేడ్కర్ జాతీయ సేవారత్న అవార్డును అందించారు. విశాఖ రత్న కళాపరిషత్ వ్యవస్థాపకులు భాస్కరరావు, సినీ నిర్మాత అచ్యుతరావు, సినీ దర్శకులు ఎన్టీఆర్ అవార్డు గ్రహీత దివాకర్, మాజీ డెప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ శ్లాబ్ పనులు ప్రారంభం



చినతుమ్మిడి ఆలయ శ్లాబ్ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ చినబాబు

బంటుమిల్లి: చినతుమ్మిడి గ్రామంలోని శ్రీ పార్వతి సమేత చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణంలో భాగంగా సోమవారం శ్లాబ్ పనులు ప్రారంభించారు. ఎంపీపీ వి. చినబాబు పనులకు శ్రీకారం చుట్టారు. శ్లాబ్‌కు కావలసిన నిర్మాణ సామగ్రిని గ్రామానికి చెందిన పిల్లి వెంకటేశ్వరరావు బహూకరించి వాటిని ఎంపీపీ చేతుల మీదుగా ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓవైవీ చలం, ఆలయ కమిటీ చైర్మన్ నారగాని అశ్వనీకుమార్, గ్రామస్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

27న ఉచిత కంటి వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి(పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 27వతేదీ ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం కృష్ణానది ఒడ్డున ఫుడ్ కోర్ట్ భవనంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందని వివరించారు. ఇతర వివరాలకు 9490636466, 9074777544 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కంటిలో శుక్లాలు ఉన్నవారికి శంకర కంటి ఆసుపత్రిలో కంటి లోపల అద్దాలు అమర్చే ఆపరేషన్‌లు(ఐఓఎల్)ఉచితంగా చేయిస్తామని శేఖర్ పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి భక్తుల విరాళాలు



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి పెడన మండలం బల్లిపర్రు గ్రామ వాస్తవ్యులు పామర్తి గణేష్ విష్ణు కుటుంబసభ్యులు రూ.50,001, విశాఖపట్నం వాస్తవ్యులు టి.శ్రీనివాసరావు రూ.50,001 విరాళంగా అందజేశారు. సోమవారం ఉదయం స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు ఈ విరాళాన్ని అందించారు. దాతలను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు.

రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం కొయ్యూరులోని రైల్వేగేటు సమీపంలో సోమవారం ఉదయం రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. ఏలూరు రైల్వే ఎస్ఐ డి.నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉంటాడని, గులాబీ రంగు షర్ట్, నలుపు రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీలో భద్రపర్చామని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి రెండేళ్ల జైలు

విజయవాడస్పోర్ట్స్: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ ఎస్. రజని సోమవారం తీర్పునిచ్చారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండపల్లిలో నివాసం ఉంటున్న 15 ఏళ్ల బాలిక బాత్‌రూమ్‌లో ఉన్నప్పుడు అదే ఇంటి వెనుక నివసించే 30 ఏళ్ల బత్తుల గురుమూర్తి సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. ఈ విషయం గమనించిన బాలిక కేకలు వేయడంతో ఆమె కుటుంబ సభ్యులు గురుమూర్తిని నిలదీసి వెంటనే వీడియోను డిలీట్ చేయించారు. ఈ ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు 2017 నవంబర్ 16న నిందితుడు గురుమూర్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.నాగిరెడ్డి కోర్టుకు వాదనలు వినిపించారు. 8 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు గురుమూర్తికి కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నిందితుడు చెల్లించిన జరిమానాలో రూ.19 వేలతో పాటు మరో రూ.50 వేలను బాలికకు నష్టపరిహారంగా అందజేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు.

ఐటీఐ కళాశాలల్లో మూడో విడత ప్రవేశాలు

గుడివాడటౌన్: కృష్ణా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మూడో విడత ప్రవేశానికి ప్రభుత్వం అనుమతించిందని కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జి.హరిధర్మేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27వ తేదీ వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన విధానం ప్రకారం అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్‌లు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌తో వెరిఫై చేయించి ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐ కౌన్సెలింగ్ ఈనెల 30, ప్రైవేట్ ఐటీఐ కౌన్సెలింగ్ 31న జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు కాల్ లెటర్స్ పంపరని, స్వయంగా సమాచారం తెలుసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 08674 295953, 99085 18799 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

స్కానింగ్ సెంటర్లలో నిరంతరం తనిఖీలు చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్కానింగ్ సెంటర్లలో నిరంతరం తనిఖీలు నిర్వహించి గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం అమలు జరిగేలే చూడాలని విజయవాడ సబ్ కలెక్టర్ అదితిసింగ్ వైద్యాధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో గర్భస్థ పిండలింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై సోమవారం డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. అదితిసింగ్ మాట్లాడుతూ ఆకస్మిక తనిఖీలు చేపట్టి, లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్ట అమలు తీరును పరిశీలించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. చట్టాన్ని సమర్థంగా అమలు చేస్తే సమాజంలో స్త్రీ పురుషుల నిష్పత్తిని కాపాడవచ్చని చెప్పారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టవిరుద్ధమనే విషయంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సబ్ కలెక్టర్ సూచించారు.

నేడు 'శ్రావణ' ప్రత్యేక పూజలు

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకుని మంగళవారం అమ్మవారి సన్నిధిలో మంగళ గౌరీవ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఆర్బీకేల్లో అందుబాటులో ఎరువులు

గూడూరు: మండలంలోని అన్ని ఆర్బీకేల్లో రైతులకు కావాల్సిన యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి జీ.వి. శివప్రసాద్ రైతులను కోరారు. గూడూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం గోదాములో సోమవారం ఎరువులను రైతులకు పంపిణీ చేశారు. శివప్రసాద్ మాట్లాడుతూ రైతులు తమ ఆధార్ నెంబర్ చెప్పి వేలి ముద్రతో ధ్రువీకరణ చేసి ఎరువులను కొనుగోలు చేయాలన్నారు. రైతులు వాడే ఎరువులపై సగటున బస్తాకు రూ. 2000 వరకు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో భరిస్తుందని తెలిపారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు అమ్మితే ఆ డీలర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆక్యుప్రెజర్‌తో సంపూర్ణ ఆరోగ్యం



మచిలీపట్నంటౌన్: ఆక్యుప్రెజర్ వైబ్రేషన్స్ సుజుకో అండ్ అయస్కాంత వైద్యంతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని 49వ డివిజన్ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లి శేఖర్ అన్నారు. శ్రీవాసవి విద్యార్థి సహాయనిధి ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తగుండు రమేష్ ఆధ్వర్యాన బైపాస్‌రోడ్డులోని ఐటీఐ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆక్యుప్రెజర్ వైద్యశిబిరాన్ని పల్లి శేఖర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ వైద్యరీతులతో నాడీ వ్యవస్థ ద్వారా అనేక రోగాలను తగ్గించుకోవచ్చన్నారు. మందులతో పని లేకుండా నాడీమండలాల ఒత్తిడితో పలు వ్యాధులు నయమవుతాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు తనరాజ్, రేవంత్ వైద్యబృందం రోగులకు వైద్యసేవలు అందించారు. వైద్యశిబిరం ఈ నెల 26వ తేదీ శనివారం వరకు జరుగుతుందని రమేష్ తెలిపారు.

తండ్రి చివరి కోరికతో నేత్రదానం



చల్లపల్లి: తండ్రి చివరి కోరిక మేరకు తనయులు తండ్రి మరణానంతరం నేత్రాలు దానం చేశారు. స్థానిక అగ్రహారానికి చెందిన నాళం వాసుదేవరావు (92) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన చివరి కోరిక మేరకు తనయులు సురేంద్ర గుప్తా, కేశవకుమార్ తండ్రి నేత్రాలను దానం చేశారు. నాగాయలంక సుదర్శి మానవతా సంస్థ నిర్వాహకులు రఘుశేఖర్‌కు సమాచారం ఇవ్వగా ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి వైద్య సిబ్బంది వాసుదేవరావు కార్నియాలు సేకరించారు.